సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 24 । మే । 2024



హోరాహోరీగా క్యారం టోర్నీ

నిజామాబాద్‌లో గురువారం ఆల్ ఇండియా క్యారం టోర్నీ ప్రారంభమైంది. క్రీడాకారులు ఉత్సాహంగా టోర్నీలో పాల్గొంటున్నారు.

- 8లో ▸



ప్రజల కోసం పనిచేయాలి

జర్నలిస్టులు ప్రజల కోసం పనిచేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.5 /25.3

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాల్లో 18,288 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 11,363, సెకండియర్ విద్యార్థులు 6,925 మంది ఉన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవి కుమార్ తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని స్పష్టం చేశారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఆరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

మెడికవర్ ఆస్పత్రి ఘటనపై విచారణకు కమిటీ

నిజామాబాద్ నాగారం: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ కింద చేరిన రోగి వద్ద డబ్బులు తీసుకోవడమే కాకుండా మృతికి కారణమైన ఘటనపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సీరియస్‌గా స్పందించారు. విచారణ చేయాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు. కమిటీ వేసి విచారణ చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి, జీజీహెచ్ హెచ్‌వోడీలు సునీత, రవినాగప్రసాద్, శ్రీనివాస్, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ స్వప్న సభ్యులుగా ఉన్నారు. వారం రోజులో విచారణ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

జీజీహెచ్‌లో హిజ్రాల కోసం కౌంటర్


నిజామాబాద్ నాగారం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హిజ్రాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌ను జిల్లా జడ్జి సునీత కుంచాల గురువారం ప్రారంభించారు. ఈ కౌంటర్‌లో హిజ్రాలకు ఆరోగ్యపరంగా ఎదురయ్యే సమస్యలకు చికిత్సతో పాటు అవసరమైన మందులు అందించనున్నారు. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై వేటుకు రంగం సిద్ధం

కామారెడ్డి టౌన్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్‌పై వేటుకు రంగం సిద్ధమవుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ విచారణ జరిపిన విషయం తెలిసిందే. విచారణ అధికారి రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీకి గురువారం నివేదిక అందించారు. ఆ నివేదికను చూసిన ప్రిన్సిపల్ సెక్రెటరీ సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో త్వరలోనే డీఎంహెచ్‌వోపై చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

నామినేటెడ్ ఉత్కంఠ

- పదవుల పందేరానికి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో ముడి పెట్టిన కాంగ్రెస్ నాయకత్వం
- సెగ్మెంట్లు, బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలను చూడనున్నట్లు ఇది వరకే ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- పూటపూటకూ లెక్కలేసుకుంటున్న ఆశావహులు



నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చే ఓట్ల ఆధిక్యతను బట్టి పదవులు ఇస్తామన్న నాయకత్వ నిర్ణయంతో హైరానా పడుతున్నారు. తమ పరిధిలోని బూత్‌లలో ఎక్కడ ఆధిక్యం వస్తుంది.. ఎక్కడ ఓట్లు తగ్గుతాయో లెక్కలేసుకుంటూ గడుపుతున్నారు. జూన్ 4న ప్రకటించే ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు తమ ప్రయత్నాలు చేస్తూనే అంతకంటే ఎక్కువగా టెన్షన్‌కు గురవుతున్నారు. నామినేటెడ్ పదవుల పందేరానికి సంబంధించి పార్లమెంట్ ఎన్నికల ఫలితం, ఆయా శాసనసభ సెగ్మెంట్లు, మండలాలు, బూత్‌ల వారీగా సాధించే ఆధిక్యతను పరిగణనలోకి తీసుకుంటామని పార్టీ నాయకత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే ప్రకటించారు. దీంతో నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పరేషాన్ అవుతున్నారు. జూన్ 4 వరకు ఓట్ల లెక్కింపు కోసం ఎదురు చూడాల్సిన నేపథ్యంలో ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతిరోజూ ఆయా బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు వస్తాయనే విషయమై ఎప్పటికప్పుడు లెక్కలు వేసుకుంటున్నారు. ఏ ఇద్దరు నాయకులు కలిసినా ఎన్నికల ఫలితం గురించి, ఎక్కడెక్కడ ఎంత ఆధిక్యం వస్తుంది, ఎక్కడ ప్రత్యర్థి పార్టీకి ఆధిక్యం వస్తుందనే విషయమై ఉత్కంఠతో లెక్కలు వేసుకుంటున్నారు. ఒత్తిడి తగ్గించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా తయారై సిట్టింగులు వేస్తూ కాలం గడుపుతున్నారు.

హైదరాబాద్ చుట్టూ చక్కర్లు..

నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు హైదరాబాద్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. జిల్లాకు చెందిన కొందరు నాయకులు రాజధానిలో ముఖ్య నేతను కలిసిన సమయంలో ఎవరికి ఏ పదవి ఇవ్వాలన్నా పార్లమెంట్ ఎన్నికల ఫలితాన్నే ప్రామాణికంగా తీసుకుంటామని చెప్పడంతో గుబులు రేగుతోంది. త్రిముఖ పోటీ అనుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీ వైపు ఎక్కువగా క్రాస్ అయ్యాయనే ట్రెండ్ కనిపిస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు హైరానా పడుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికల తరువాతా.. ముందేనా?

జిల్లాలో నుడా, మార్కెట్ కమిటీ, గ్రంథాలయ కమిటీ, ఇతర రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న నాయకులు, సీనియర్ కార్యకర్తల సంఖ్య జిల్లాలో చాంతాడంత ఉంది. ఎవరికి వారు గట్టి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకు మాట్లాడేది లేదని, ఆ తరువాత సైతం బూత్‌ల వారీగా ఆధిక్యతను బట్టి పదవులు ఇస్తామని అధినాయకులు చెప్పడంతో పరేషాన్‌లో ఉన్నారు. ఇక జిల్లా నుంచి మంత్రి పదవి రేసులో ఉన్న పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్న బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా లోక్‌సభ ఫలితాల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు, స్థానిక ఎన్నికల తరువాత నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందా.. ముందే ఉంటుందా అనే విషయం అంతుచిక్కని పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు టెన్షన్‌తో ఎదురు చూడడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

మీనమేషాలు!



పోచంపాడ్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం

- ప్రారంభం కాని చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ
- ఎస్సారెస్పీలోని తల్లి చేపలు పనికిరావంటున్న అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రకియ ఇంకా ప్రారంభం కాలేదు. చేప పిల్లల ఉత్పత్తి కోసం ముందుగా తల్లి చేపలను సేకరించాలి. ఈ కేంద్రంలో ఐదు కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. దీనికి 1.5 టన్నుల తల్లి చేపల అవసరం ఉంటుంది. తల్లి చేపలను మే నెలలోనే సేకరించాలి. ప్రస్తుతం చేపలు అన్ని కూడా గుడ్డు దశలో ఉంటాయి. నాణ్యమైన తల్లి చేపలను సేకరించి, ఉత్పత్తి కేంద్రం వద్ద మట్టి కుండీల్లో దాణా వేసుకుంటూ పెంచాలి. అనంతరం తల్లి చేపల నుంచి నిత్యం గుడ్డును సేకరించి, హెచరీలో వేసి చేప పిల్లలను ఉత్పత్తి ప్రారంభిస్తారు. కానీ ఇప్పటికీ ప్రక్రియ మొదలు కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేప పిల్లలను చెరువుల్లో వదులుటకు వంద శాతం సబ్సిడీపై మత్స్య సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తారు.

చెరువుల నుంచి సేకరించాలి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం పెద్ద పెద్ద చేపలు చిక్కుతున్నాయి. కానీ ప్రాజెక్ట్ చేపలు గడ్డు సేకరణకు పనికి రావని మత్స్య అభివృద్ధి అధికారులు అంటున్నారు. ప్రాజెక్ట్‌లో లోతు ఎక్కువగా ఉండటంతో వలకు చేపలు చిక్కవు. కేవలం పాండ్రి(తలకు వేసే ఉరి) వలలకు మాత్రమే పెద్ద చేపలు చిక్కడంతో గుడ్డు సేకరించే వరకు ఆరోగ్యంగా ఉండవని అంటున్నారు. దీంతో ప్రాజెక్ట్‌లో తల్లి చేపల సేకరణ చేపట్టడం లేదు. చెరువుల నుంచి తల్లి చేపలను సేకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరగా ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

తల్లి చేపల సేకరణ ప్రారంభిస్తాం

చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభించుటకు సిద్ధంగా ఉన్నాం. తల్లి చేపల సేకరణ రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. జిల్లాలో కొన్ని చెరువులను తల్లి చేపల సేకరణ కోసం ఎంపిక చేశాం.

– లాయక్ మొహినొద్దీన్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

సజ్జకు మంచి ధర

- బైబ్యాక్ ఒప్పందానికి మించి చెల్లిస్తున్న వ్యాపారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



సుంకెట్‌లో సజ్జలను సంచులలో నింపుతున్న రైతులు

మోర్తాడ్(బాల్కొండ): సజ్జలకు వ్యాపారులు ఒప్పందానికి మించి ధర చెల్లిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో సాగు చేసిన సజ్జలకు క్వింటాలుకు రూ.7వేల వరకు ధర చెల్లించేలా వ్యాపారులు బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం సజ్జలకు ఉత్తరాది రాష్ట్రాలలో డిమాండ్ ఉండటంతో క్వింటాలుకు రూ.300 అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తుండటం విశేషం. గత సీజన్‌లో రూ.4వేల నుంచి రూ.4,200 వరకు ధర చెల్లించిన వ్యాపారులు ఈసారి మాత్రం ఏకంగా రూ.3వేల ధర పెంచారు. సజ్జలకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు నువ్వుల సాగుపై దృష్టి సారించారు. ఫలితంగా సజ్జల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. మరోవైపు గతంలో కంటే ఈసారి దిగుబడి కూడా పెరిగింది. కొన్ని వ్యవసాయ క్షేత్రాల్లో 12 క్వింటాళ్ల వరకు దిగుబడి లభించగా శెట్‌పల్లి ప్రాంతంలో 19 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మేలు రకమైన సజ్జ సీడ్ సరఫరా చేయడంతో దిగుబడి పెరిగిందని యువరైతు గురిజాల నర్సారెడ్డి ‘సాక్షి’తో చెప్పారు.

కోడ్ ముగియగానే బదిలీలు!

- ఏఈ నుంచి డీఈల వరకు స్థానచలనం
- విద్యుత్‌శాఖలో జోరుగా చర్చ



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే విద్యుత్‌శాఖలో బదిలీలు జరగనున్నాయి. ఏఈల నుంచి డీఈల వరకు స్థానచలనం పొందనున్నారు. అయితే ఆయా సంఘాలకు సంబంధించిన యూనియన్ నాయకులకు ప్రొటెక్షన్(బదిలీ కాకుండా) లేకుండానే బదిలీల ప్రక్రియ పూర్తి చేయడానికి జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో నాలుగు డివిజన్‌లున్నాయి. ఆరుగురు డీఈలు, 22 మంది ఏడీఈలు, 75 మంది ఏఈలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఏఈల వివరాలను సీఎండీ కార్యాలయానికి జిల్లా అధికారులు అందజేశారు. ఏడీఈ, డీఈల సమాచారం వరంగల్ ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో ఉంటుంది.

సర్వత్రా ఆసక్తి

ప్రస్తుతం జరుగుతున్న బదిలీలపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. ట్రేడ్ యూనియన్, ఇంజినీరింగ్ సంబంధించిన నాయకులకు మాత్రమే ప్రొటెక్షన్ ఉంటుంది. జిల్లాలో, కంపెనీ పరిధిలో యూనియన్‌లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఉద్యోగులు చాలా మంది ప్రొటెక్షన్ పేరుతో సంఘాలను ఏర్పాటు చేసుకొని జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్న విషయం సీఎండీ దృష్టికి వెళ్లింది. దీంతో ఈసారి యూనియన్ నాయకుడైనా సరే తన సర్వీసులో ఒక్కసారి మాత్రమే ప్రొటెక్షన్ తీసుకోవాలని, పదే పదే ఇవ్వకూడదని భావించినట్లు సమాచారం. ఏఈ నుంచి డీఈ వరకు బదిలీ కాగానే కిందిస్థాయిలో బదిలీలు జరగనున్నాయి. మూడేళ్ల సర్వీసు ఉంటే బదిలీ జరుగుతుంది.

ఏఈల సమాచారం ఇచ్చాం

ఎన్‌పీడీసీఎల్ నుంచి బదిలీల విషయంలోనే ఏఈల సమాచారాన్ని అడిగారు. ఇప్పటికే అందజేశాం. ఏడీఈ, డీఈ, ఆపై అధికారుల సమాచారం ఎన్‌పీడీసీఎల్ కంపెనీలో ఉంటుంది. జూన్‌లో ఎన్నికల కోడ్ తర్వాతా బదిలీలు జరగనున్నాయి.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

మంజీరలో ‘మహా’ తవ్వకాలు

- ఇసుక క్వారీలకు మహారాష్ట్ర సర్కారు అనుమతి
- భారీ యంత్రాలతో తవ్వకాలు
- పెండింగ్‌లోనే నది సరిహద్దు వివాదం



సాలూర శివారులో మహారాష్ట్ర ప్రాంతంలోని ఎస్గీ గ్రామం వద్ద డంప్ చేసిన ఇసుక



నదిలో ఇసుక తవ్వకాలు

బోధన్: తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులో ప్రవహిస్తున్న మంజీర నదిలో ఇసుక క్వారీలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ ప్రాంత ఇసుక క్వారీల్లో భారీ యంత్రాలతో నదిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఇసుకను తవ్వి నది ఒడ్డున డంప్ చేసి లారీల్లో తరలిస్తున్నారు. వేలంపాట నిర్వహించి మహారాష్ట్ర సర్కారు కాంట్రాక్టర్లకు క్వారీలు అప్పగిస్తోంది. సాలూర మండల కేంద్రానికి సరిహద్దులో ఉన్న మంజీర నది అవతలి ఒడ్డున గల మహారాష్ట్ర ప్రాంతం నాందేడ్ జిల్లా బిలోలి, దెగ్లూర్, ధర్మాబాద్ తాలూకాల పరిధిలోని ఎస్గీ, సగ్రోలి, శావుల, శాకాపూర్, హునుగుంద ప్రాంతంలోని మంజీరలో ఇసుక తవ్వకాలు నెల రోజుల నుంచి సాగుతున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర ప్రాంతంలోనే తవ్వకాలు సాగుతున్నప్పటికీ ఏ క్షణంలోనైనా మన ప్రాంతంలో చొచ్చుకువచ్చి ఇసుక తోడేసే ప్రమాదం పొంచి ఉంది. గతంలో అక్రమంగా మన సరిహద్దుల్లోకి చొరబడి ఇసుక తవ్వకాలు చేపడితే మన ప్రాంత గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో చాలా చోటు చేసుకున్నాయి. ఇరు ప్రాంత సరిహద్దు గ్రామాల మధ్య ఘర్షణలు, దాడులు జరిగిన ఘటనలు ఉన్నాయి. దశాబ్దంన్నరగా మహారాష్ట్ర ప్రభుత్వం ఇసుక క్వారీలకు అనుమతి ఇచ్చి రూ.కోట్ల ఆదాయం దండుకుంటోంది. క్వారీల అనుమతి విషయంలో మన జిల్లా అధికార యంత్రాంగానికి కనీస సమాచారం కూడా అందించడం లేదు. మన ప్రాంత మంజీరలో క్వారీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు.

పొంచి ఉన్న ముప్పు

మహారాష్ట్ర ప్రాంత మంజీరలో ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా ఇసుక తోడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో నది లోతట్టుగా మారుతుంది. నదిలో నీళ్ల పారకంలో సమతుల్యత లేకుండా పోతుంది. లోతట్టు ప్రాంతంలో నీళ్ల పారకం క్రమంగా పెరుగుతు వస్తోంది. మరో వైపు వరదలతో మన ప్రాంత ఇసుక నది లోతట్టు ప్రాంతానికి తరలిపోతుంది. ప్రతి యేటా వర్షాకాలంలో మంజీరలో వరద పోటెత్తి ప్రవహిస్తోంది. ఇసుక తవ్వకాలతో మన ప్రాంత సరిహద్దు గ్రామాల రైతుల బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.

ఏళ్లుగా పెండింగ్‌లోనే..

మంజీర నదిలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య సరిహద్దు వివాదం ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. 2015లో జిల్లా అభివృద్ధి సలహా మండలిలో అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధులు సరిహద్దు వివాదం అంశాన్ని చర్చ పెట్టి మహారాష్ట్ర సర్కారును సంప్రదించి పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఎవరూ ఆ ఊసే ఎత్తలేదు. గతంలో జిల్లా రెవెన్యూ ,పోలీస్ శాఖ అధికారులు సరిహద్దు వివాద పరిష్కారానికి పలుమార్లు ప్రయత్నించినా అక్కడి అధికారులు స్పందించలేదు. వివాదం అలాగే ఉండటం, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల రైతుల పట్టా భూములు కొన్ని మన ప్రాంత శివారులో ఉండటం మహారాష్ట్ర ప్రభుత్వానికి కలిసి వస్తోంది. సరిహద్దు వివాదం పరిష్కారమైతే మంజీర తీర ప్రాంత సరిహద్దు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విధానపరంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇసుక క్వారీలతో నష్టమే..



మహారాష్ట్ర సరిహద్దులోని మంజీరలో ఇసుక తవ్వకాలు మన ప్రాంతానికి తీవ్ర నష్టం చేస్తున్నాయి. నదిలో నీటి పారకం సమతుల్యత దెబ్బ తింటోంది. నది సరిహద్దు వివాదాన్ని జిల్లా ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి.

– పుట్ట వరదయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి

సమాచారం లేదు



బోధన్ రెవెన్యూ డివిజన్‌కు సరిహద్దులో ఉన్న మంజీరలో మహారాష్ట్ర ప్రాంత ఇసుక క్వారీలకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. డివిజన్ స్థాయి తహసీల్దార్ల సమావేశం నిర్వహించి, మన ప్రాంత మంజీరలో ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశాలిస్తాం.

– అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవో బోధన్

నిఘా పెట్టాలి



మంజీరలో మహారాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా క్వారీలకు అనుమతిస్తోంది. మన ప్రాంత సరిహద్దులో చొచ్చుకు వచ్చి ఇసుక తవ్వకాలు జరగకుండా అధికారులు నిఘా పెట్టాలి. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం కలిగే ప్రమాదం ఉంది.

– మందర్న రవి, హున్సా సొసైటీ చైర్మన్

అధికారుల పేరిట జోరుగా వసూళ్లు

- సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు
- ఒక్కో ట్రిప్పునకు రూ. 200 వసూలు



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

మోర్తాడ్: మండలంలోని సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వ్యాపారుల్లో కొందరు భారీగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు ముడుపులు ఇవ్వాల్సి ఉందనే సాకుతో ఇసుక పాయింట్ ఉన్న రోజున ఒక్కో ట్రిప్పునకు రూ.200 చొప్పున రూ.80వేల వరకు భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి వారంలో రెండు, మూడు రోజుల పాటు ఇసుకను తరలించడానికి రెవెన్యూ అధికారులు అనుమతి ఇస్తున్నారు. ఒక రోజు ఇసుక తరలిస్తే రూ.80వేల చొప్పున వసూలు చేస్తుండటంతో నెలలో 10 నుంచి 12 రోజుల పాటు ఇసుక తరలింపునకు అనుమతి ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రతి నెలలో అధికారుల పేరిట అక్రమంగా వసూలు చేస్తున్న మొత్తం రూ.8లక్షలకు మించిపోతుంది. రెవెన్యూ, పోలీసు అధికారులకు ముడుపులు ఇవ్వడం కోసమే వసూలు చేస్తున్నామని కొందరు బడా వ్యాపారులు ఇసుక ట్రాక్టర్లు, ట్రిప్పుల లెక్క ప్రకారం భారీ మొత్తంలో కూడబెట్టుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక తరలింపు పారదర్శకంగా ఉండటానికి రెవెన్యూ అధికారులు వే బిల్లులను జారీ చేయడంతో పాటు తమ సిబ్బందిని కాపలా ఉంచి ఇసుకను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల కాగితాలు సరిగా లేకపోవడం, ఒకే వే బిల్లుపై రెండు, మూడు ట్రిప్పుల ఇసుకను తరలించడం ఇలా ఎన్నో రకాలైన వేషాలు వేయడానికి ముడుపులు ఇవ్వక తప్పదని ఇసుక వ్యాపారులు చెబుతున్నారు. ఈ విషయమై ‘సాక్షి’ రెవెన్యూ, పోలీసు అధికారులను సంప్రదించగా ఇసుక పాయింట్ వద్ద అక్రమ వసూళ్ల బాగోతంపై సమగ్ర విచారణ జరుపుతామని వెల్లడించారు. ముడుపుల పేరిట వసూలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్



సిరికొండ: మండలంలో బుధవారం సా యంత్రం వీచిన భారీ గాలుల కారణంగా విద్యుత్‌శాఖకు భారీ నష్టం వాటిల్లింది. సిరికొండ సెక్షన్ పరిధిలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, అరవై వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. గడ్కోల్ సెక్షన్ పరిధిలో ముప్పై వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ఆయా సెక్షన్ల పరిధిలో స్తంభాల పునరుద్ధరణ, మరమ్మతుల పనులను గురువారం చేపట్టారు. భారీ గాలులు, వర్షం కారణంగా పలుచోట్ల చెట్లు నేలకూలాయి. రోడ్లపై పడిపోయిన చెట్లు, కొమ్మలను స్థానికులు తొలగించారు. సిరికొండ టెలి ఫోన్ ఎక్స్ఛేంజీలో వినియోగంలో లేని చిన్న టవర్ అదే భవనంపై పడిపోయింది. సిరికొండ మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణకు చెందిన రేకుల షెడ్డు పైకప్పు లేచిపోయి కొద్ది దూరంలో పడింది.

క్లుప్తంగా

హోరాహోరీగా క్యారం టోర్నీ



నిజామాబాద్‌ నాగారం: ఆల్‌ ఇండియా క్యారం పోటీలు జిల్లా కేంద్రంలోని నవ్యభారతి స్కూల్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. క్యారం అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌ ఆధ్వర్యంలో వెటరన్‌ మెన్‌, ఉమెన్‌ విభాగంలో పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన పురుషుల సింగిల్స్‌లో ఎయిర్‌పోర్ట్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియాపై జైన్‌ ఇరిగేషన్‌ జట్టు విజయం సాధించింది. సిద్ధాంత వాడేకర్‌ (ఏఏఐ), అభిజిత్‌ త్రిపాంకర్‌ (జేఐఎస్‌ఎల్‌)పై గెలుపొందారు. శివదయాల్‌ (ఏఏఐ)పై జైద్‌ అహ్మద్‌ (జేఐఎస్‌ఎల్‌) విజయం సాధించాడు. సందీప్‌ దీవే, రహీం ఖాన్‌ – ముష్రఫ్‌, వహీద్‌ ఇబాల్‌ మధ్య నిర్వహించిన డబుల్స్‌లో జేఐఎస్‌ఎల్‌ జట్టు విజయం సాధించింది. మహిళల విభాగంలో వినీత (సీసీఎస్‌సీఎస్‌), బి స్వర్ణలత (సీఏజీ) మ్యాచ్‌లో వినీత విజయం సాధించారు. రెండో మ్యాచ్‌లో నీలంగౌడ్‌, ఆర్‌ షర్మిల మధ్య సింగిల్స్‌లో నీలం విజయం సాధించారు. డబుల్‌ మ్యాచ్‌లో సీఐజీ జట్టు విజయం సాధించింది.

అకాల వర్షం



దోమకొండ/గాంధారి: జిల్లాలోని పలు ప్రాంతాలలో గురువారం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. కామారెడ్డి నుంచి ముత్యంపేటకు వెళ్లే రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనదారు లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్దనున్న ధాన్యం తడిసిపోయింది. ముత్యంపేట శివారులోని కాలనీలో విద్యుత్‌ వైర్లు తెగిపోవడంతో రెండు గంటలపాటు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. గాంధారి మండలంలోని గుడిమెట్‌ గ్రామ శివారులో విద్యుత్‌ స్తంభాలు విరిగిపోయాయి. వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మండల కేంద్రంలో విద్యుత్‌ మీటర్లు, ఫ్యాన్లు తదితర ఎలక్ట్రానిక్‌ వస్తువులు కాలిపోయాయి.

పొరుగు జిల్లాల నుంచి గంజాయి

- స్థానికంగా కట్టడి చేసినా.. నిర్మల్‌, జగిత్యాల్‌ నుంచి సరఫరా
- యథావిధిగా సాగుతున్న 'మత్తు' దందా



తాళ్లరాంపూర్‌లో గంజాయి సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): జిల్లాలో గంజాయి దందాను కట్టడి చేస్తున్నా పొరుగు జిల్లాల నుంచి యథేచ్ఛగా సరఫరా అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి సేవిస్తున్న హైదరాబాద్‌కు చెందిన యువకులను ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో రెండు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నిర్మల్‌ జిల్లా నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. గతంలోనూ జగిత్యాల్‌ జిల్లా కోరుట్ల నుంచి యువకులు వచ్చి ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ప్రాంతాల్లో గంజాయి విక్రయించగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ రెండు ఘటనలను పరిశీలిస్తే పొరుగు జిల్లాల నుంచి గంజాయి సరఫరా యథావిధిగా కొనసాగుతోందని స్పష్టమవుతోంది. గతంలో గంజాయి దందాను కట్టడిచేసేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ రాజకీయ నాయకుల జోక్యం కారణంగా సఫలంకాలేకపోయారనే ఆరోపణలున్నాయి. గత కొద్ది నెలలుగా పోలీసులు నిఘా సారించడంతో జిల్లాలో గంజాయి దందాకు బ్రేక్‌ పడింది. అయితే, పొరుగు జిల్లాల నుంచి మాత్రం గంజాయి యథేచ్ఛగా జిల్లాకు చేరుతున్నట్లు తాజా ఘటనలు నిరూపిస్తున్నాయి. గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌ ఇవ్వడంతో పాటు గంజాయి సరఫరా చేసేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తే.. ఈ దందాను అరికట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కౌన్సెలింగ్‌ ఇవ్వాలి



గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌ ఇవ్వాలి. మత్తులో జోగుతున్న యువతకు అవగాహన కల్పిస్తే గంజాయిని అరికట్టవచ్చు. యువకులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇస్తే సత్ఫలితాలు సాధించొచ్చు.

– పెండెం శ్రీనివాస్‌, వద్యాట్‌

కఠినంగా వ్యవహరించాలి



గంజాయిని అరికట్టే విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. గంజాయి విక్రేతలపై పీడీ యాక్టును అమలు చేయాలి. రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నా నిక్కచ్చిగా వ్యవహరించాలి. యువత కూడా పెడదారి పట్టకూడదు.

– సతీశ్‌, జిల్లా టెలికాం బోర్డు డైరెక్టర్‌, మోర్తాడ్‌

జిల్లా కేంద్రంలో గంజాయి పట్టివేత

- ఎక్సైజ్‌ పోలీసుల దాడులు
- వేర్వేరు చోట్ల 2 కిలోలకుపైగా స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖిల్లా చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం తనిఖీలు నిర్వహించి 1220 గ్రాముల గంజాయిని సీజ్‌ చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ తెలిపారు. సాదుల్లా ఖాన్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, ఎండీ యూనస్‌ అలియాస్‌ రిజ్వాన్‌ అనే మరో వ్యక్తి పరారయ్యాడన్నారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తనిఖీలో ఎక్సైజ్‌ ఎస్సైలు సుష్మిత, సింధు, సిబ్బంది ప్రభాకర్‌, షబ్బీరుద్దీన్‌, సంగయ్య, ధార్‌సింగ్‌, సంజయ్‌ పాల్గొన్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

బీహార్‌కు చెందిన వ్యక్తి వద్ద..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఖానాపూర్‌ ప్రాంతంలో బీహార్‌కు చెందిన రుదల్‌ శర్మ అనే యువకుడి వద్ద 1200 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ సీఐ విలాస్‌ తెలిపారు. బ్యాగులో గంజాయి పెట్టుకొని జన్నేపల్లి రోడ్డులోని ఓ వే బ్రిడ్జి సమీపంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న రుదల్‌ శర్మను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి నిజామాబాద్‌ ఎక్సైజ్‌ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దాడిలో సిబ్బంది సలీం, సాగర్‌రావు, కిరణ్‌కుమార్‌, నీలిరాజు, నర్సయ్యచారి, గోపి పాల్గొన్నారు.



ఎక్సైజ్‌ పోలీసుల అదుపులో ఉన్న సాదుల్లా



టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన రుదల్‌ శర్మ

జర్నలిస్టులు ప్రజల కోసం పని చేయాలి



టీయూడబ్ల్యూజే సదస్సులో మాట్లాడుతున్న ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కె శ్రీనివాస్‌రెడ్డి

- పోరాట శీలత తగ్గడంతో ఇబ్బందులు
- ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కె శ్రీనివాస్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని, పోరాట శీలత తగ్గడం వల్ల జర్నలిజానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా.. ప్రభుత్వాలు, అధికారుల కోసం కాకుండా ప్రజల కోసం జర్నలిస్టులు పని చేయాలని ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం– మీడియా' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛలో ప్రపంచంలో 159 వ స్థానంలో ఉన్నామని, జర్నలిస్టులకు సమాజంలో గౌరవం తగ్గిందనేది సత్యమని అన్నారు. సమాచార హక్కు కూడా ప్రజలకున్నా ఈ రోజు ఆ హక్కును పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సత్యాన్ని రాసిన జర్నలిస్టు షోయబ్‌ ఉల్లాఖాన్‌ హత్యకు గురయ్యాడని గుర్తు చేశారు. ప్రధాన పత్రికలు పార్టీలకు మద్దతు తెలిపే యాజమాన్యాల చేతుల్లో ఉండడం వల్ల ప్రజాసమస్యలు బయటకు రాని పరిస్థితి ఉందన్నారు. అందుకే సోషల్‌ మీడియా ఈ రోజు సక్సెస్‌ ఫుల్‌గా ముందుకు సాగుతోందన్నారు.

ప్రశ్నించే బలమైన గొంతు అయిన జర్నలిజాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. సమాచారం చేరవేయడంలో ఉండాల్సిన పారదర్శకత ఇప్పుడు లేదని, జర్నలిస్టులు హంసల పాత్ర వహించి పాలను నీరును వేరు చేసినట్లు నిష్పక్షపాతంగా ప్రజలకు సమాచా రాన్ని చేరవేయాలన్నారు. బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, విలువల కోసం ధీరోదాత్తతతో పోరాడాలన్నారు. జర్నలిస్టులను గౌర వించాల్సింది అధికారులు, నేతలు కాదని, ప్రజలే అన్నారు. ప్రజాస్వామ్య మనుగడలో జర్నలిస్టులది కీలకపాత్ర అన్నారు. వార్తకు తటస్థం లేదు..తటస్థముంటే అది ప్యాకేజీ వార్తనే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున పని చేస్తున్న మీడియాకు కూడా పారదర్శకత అవసరమే అన్నా రు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలనుకునేవారందరూ ఫిఫ్త్‌ ఫిల్లర్‌గా ఏర్పడి కలిసి పనిచేయాలన్నారు. వృత్తి ప్రమాణాలు కాపాడుకోవడానికి, జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రజాకవి, రచయిత డాక్టర్‌ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు సమాజంలో గౌరవ మర్యాదాలు ఉంటాయని, వాటిని కాపాడుకోవాల్సిన బా ధ్యత తప్పనిసరిగా ఉంటుందన్నారు. విలువలతో కూడిన జర్నలిజం ఉండాలన్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ మాట్లాడారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, రాష్ట్ర కోఆపరేటివ్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు గడుగు గంగాధర్‌, జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సంజీవ్‌, ప్రధాన కార్యదర్శి బాలాజీ, సీనియర్‌ జర్నలిస్టులు చింతల గంగాదాస్‌, బొబ్బిలి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కథనాలపై చర్చ

సమావేశం ముగిసిన తర్వాత జర్నలిస్టులు, రాజకీయ నాయకులు 'సాక్షి'లో వచ్చిన కథనాలపై చర్చించారు. అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ ప్రత్యేకంగా తన ప్రసంగంలో 'సాక్షి'లో వాస్తవ కథనాలు వస్తున్నాయని మాట్లాడడంతో చర్చ జరిగింది. ముఖ్యంగా మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాలు బయటకు తీయడంలో 'సాక్షి' చేస్తున్న కృషి గురించి జర్నలిస్టులు చర్చించుకోవడం గమనార్హం.

రేపు విత్తన మేళా

రుద్రూర్‌: మండల కేంద్రంలోని ప్రాంతీయ వరి, చెరుకు పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళాను నిర్వహించనున్నట్లు కేంద్రం అధిపతి బాలాజీ నాయక్‌ గురువారం తెలిపారు. పరిశోధన కేంద్రంలో ఆర్‌డీఆర్‌–1200, ఆర్‌డీఆర్‌–1162 వరి రకాలు, సోయా చిక్కుడు బాసర రకం అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన రైతులు పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి విత్తనాలు పొందవచ్చని తెలిపారు.

జూన్‌ 6 లోగా యూనిఫామ్స్‌ అందజేయాలి

- డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఈవో దుర్గాప్రసాద్‌
- డిచ్‌పల్లిలో మహిళా శక్తి కుట్టు కేంద్రం ప్రారంభం



కుట్టు కేంద్రం బాధ్యులతో డీఆర్డీవో, డీఈవో

డిచ్‌పల్లి(నిజామాబాద్‌ రూరల్‌): జిల్లా వ్యాప్తంగా స్కూల్‌ యూనిఫామ్స్‌ను జూన్‌ 6వ తేదీ లోగా అందజేయాల్సి ఉంటుందని డీఈవో దుర్గాప్రసాద్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌ అన్నారు. మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో సాయాగౌడ్‌ మాట్లాడుతూ.. స్కూల్‌ యూనిఫామ్స్‌ కుట్టే బాధ్యతను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించిందని, మహిళలకు శిక్షణ ఇచ్చి జిల్లాలో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లక్షా 12 వేల యూనిఫామ్స్‌ అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం సరఫరా అయిన వస్త్రంతో ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫామ్‌ మాత్రమే అందజేస్తారని, ప్రభుత్వం మళ్లీ వస్త్రం పంపిన తరువాత రెండో జత అందజేస్తారన్నారు. యూనిఫామ్స్‌ కుట్టడం ద్వారా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవీందర్‌, డీపీఎం సాయిలు, ఏపీఎం రజిత, సీసీలు, వీవోఏలు, ఓబీలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కాపర్‌ కాయిల్స్‌ చోరీ



ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌ గ్రామ శివారులో ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుందని, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఇసిపేట రజిని ఇంట్లో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రజిని తల్లి గత 20 రోజుల క్రితం మృతి చెందగా, ఆమె ఇంటికి తాళం వేసి పెద్దమ్మ వాళ్ల ఇంట్లో ఉంటోంది. బుధవారం రాత్రి విద్యుత్‌ సరఫరా నిలిచిపోయిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. బీరువాలోని బంగారం నగలు, వెండిని దుండగులు ఎత్తుకెళ్లడంతోపాటు టీవీని ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై చైతన్యకుమార్‌ ఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్‌ టీముకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొరం టిప్పర్‌ బోల్తా



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై గురువారం మొరం టిప్పర్‌ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు నర్సింలుకు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. తాడ్వాయి శివారులోని గుట్ట నుంచి కామారెడ్డి వైపు మొరం తరలిస్తుండగా ప్రభుత్వ జూనియర్‌కళాశాల సమీపంలో అదుపు తప్పి టిప్పర్‌ బోల్తా పడిందన్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్‌



మాచారెడ్డి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్‌ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. మండలంలోని చుక్కాపూర్‌ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్లను సీజ్‌ చేశామన్నారు.

బెదిరించి దోపిడీ

నవీపేట: మండలంలోని పొతంగల్‌ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఒకరిని బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. నందిపేట మండలం తల్వేదకు చెందిన ఎర్రోల్ల సంజీవ్‌ పనినిమిత్తం బుధవారం ఉదయం మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరుగుప్రయాణమైన ఆయన నవీపేటలో బస్సు దిగి తల్వేద వైపు వెళ్లేందుకు వాహనాల కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులను లిఫ్ట్‌ అడుగగా, వారు బైక్‌పై ఎక్కించుకున్నారు. పొతంగల్‌ శివారులోకి వెళ్లగానే మరో వ్యక్తి వీరికి జత కలిసి ముగ్గురూ కలిసి సంజీవ్‌ను బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.3,800 నగదును లాక్కొని పరారయ్యారు. సంజీవ్‌ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకోగా దుండగులు అప్పటికే పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- అత్యాచారం కోణంలో పోలీసుల దర్యాప్తు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ



లక్ష్మి (ఫైల్‌)

బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ–గాంధారి ప్రధాన రహదారిపై కృష్ణానగర్‌ తండా సమీపంలోని అటవీప్రాంతంలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని బాన్సువాడ పోలీసులు గురువారం గుర్తించారు. చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించగా, గాంధారి పోలీస్‌స్టేషన్‌లో అదే మండలంలోని బూర్గుల్‌ గ్రామానికి చెందిన మాదాపల్లి లక్ష్మి(37) వారం రోజుల నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు నమోదైనట్లు తెలిసింది.

లక్ష్మి కుటుంబ సభ్యులు పోలీసులతో కలిసి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతదేహం ఆమెదేనని గుర్తించారు. చుట్టుపక్క గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతల్లో కూరగాయాలు విక్రయిస్తూ జీవించే లక్ష్మి ఈనెల 16న బాన్సువాడ సంతలోనూ కూరగాయలు విక్రయించి ఇంటికి తిరిగి వెళ్లలేదు. మృతదేహంపై దుస్తులు చిందరవందరగా ఉండటంతోపాటు పుర్రె పగిలి, దవడ విరిగి ఉంది. లక్ష్మిని గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హతమార్చినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. సమాచారం అందుకున్న ఎస్పీ సింధుశర్మ, బాన్సువాడ డీఎస్పీతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి చిన్నమ్మ కూతురు వరుసకు అక్క అయిన బాల సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సింధుశర్మ

రోడ్డు ప్రమాదంలో ఎమ్మార్పీఎస్‌ నాయకుడు..

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దులం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జక్రాన్‌పల్లి మండలం చింతలూర్‌కు చెందిన ఎమ్మార్పీఎస్‌ నాయకుడు గుద్దేటి అశోక్‌ (53) మృతి చెందినట్లు ఎస్సై యూ.మహేశ్‌ గురువారం తెలిపారు. యానంపల్లి నుంచి చింతలూర్‌కు వెళ్తుండగా కల్వర్టు నిర్మాణం కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు బైక్‌ పడిపోవడంతో అశోక్‌ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు అజయ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం కారణంగా అశోక్‌ మృతి చెందాడని ఎమ్మార్పీఎస్‌ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గంధమాల నాగభూషణం మాదిగ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన డిచ్‌పల్లి లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

మురికి కాలువలో పడి..



మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లి మండలం లోని దోతి గ్రామంలో మురికి కాలువలో పడి జిల్లా సాయిలు(33) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా పొతంగల్‌కు చెందిన జిల్లా సాయిలుకు దోతి గ్రామానికి చెందిన శివానందతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. మంగళవారం సాయంత్రం అత్తగారింటికి వచ్చిన సాయిలు బుధవారం గ్రామ శివారులోని రోడ్డు పక్కన ఉన్న మురికి కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి అన్న జిల్లా గంగారాం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

గుర్తు తెలియని యువతిపై దాడి

- కెనాల్‌ కట్టపై వదిలి వెళ్లిన దుండగులు



కెనాల్‌ కట్టపై తీవ్రగాయాలతో పడి ఉన్న యువతి

ఎడపల్లి (బోధన్‌): మండలంలోని జానకంపేట గ్రామ శివారులో ఉన్న మల్లన్నగుడి వద్ద నిజాంసాగర్‌ పెద్ద కాలువపై గుర్తు తెలియని యువతి తీవ్రగాయాలతో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యువతిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుండగులు యువతిపై దాడి చేసి కెనాల్‌ కట్టపై వదిలి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఎస్సై వంశీచందర్‌రెడ్డి సూచించారు. యువతి ఆరోగ్యం కుదుటపడిన తరువాత పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు.

ఒకరి అదృశ్యం




కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన ఒంటెద్దు సాయిలు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. మార్చి 16న కామారెడ్డి రైల్వే స్టేషన్‌ వద్ద తన బైక్‌ను అన్న కొడుకు శ్యామ్‌కు అప్పగించి పనిమీద బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రెండుమూడు రోజుల్లో వస్తానని చెప్పి వెళ్లిన సాయిలు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సాయిలు భార్య అనిత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చెరువులో నుంచి బైక్‌ వెలికితీత



మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తొర్తి చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను పారేశారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజులుగా చెరువులో బైక్‌ ఆనవాళ్లను గుర్తిస్తున్న గ్రామస్తులు గురువారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి బైక్‌ను బయటికి తీయించారు. బైక్‌ పూర్తిగా ధ్వంసమైందని, బైక్‌ల చోరీకి పాల్పడే వ్యక్తులే చెరువులో పారేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

'ఉపాధి' కూలీకి పాముకాటు



ఎల్లారెడ్డి: ఉపాధి హామీ పనులు చేస్తున్న ఓ యువకుడిని పాము కరిచిన ఘటన మండలంలోని లక్ష్మాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్‌ శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న నీల రఘు అనే యువకుడు మట్టి తవ్వుతున్న సమయంలో చేతికి పాము కరిచిందన్నారు. వెంటనే తోటి కూలీలు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం యువకుడిని ఎంపీవో ప్రకాశ్‌, ఈజీఎస్‌ సిబ్బంది, కాంగ్రెస్‌ నాయకుడు సాయిబాబా తదితరులు పరామర్శించారు.

ఇద్దరి అరెస్ట్‌

రాజంపేట: వ్యవసాయ భూముల్లో బోరు మోటార్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా తలమడ్ల రోడ్డు హనుమాన్‌ ఆలయం పరిసరాల్లోని వ్యవసాయభూముల్లో నుంచి బోరు మోటార్లు, ఇతర సామగ్రి చోరీకి గురవుతుండడంతో రైతులు బుధవారం రాత్రి గస్తీ చేపట్టి ఇద్దరిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రైతు మహ్మద్‌ షాదుల్లా ఫిర్యాదు మేరకు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు.